
## చిట్టి కథ



# రైలు పట్టాలు

రైలు ఔటర్ సిగ్నల్ దగ్గర ఆగిపోయింది. స్టేషన్ మరో ఫర్లాంగు దూరమే వుంది. పచ్చని పొలాల మీంచి వీచేగాలి కిటికీలోంచి దూరి శరీరానికి చల్లగా తగుల్తోంది. వాతావరణం హాయిగా వుంది. ట్రావెలింగు బాగు భుజానికి తగిలించుకుని జాగ్రత్తగా కంపార్టుమెంటు దిగి రైలు పట్టాల మీద నడుస్తున్నాను. బాలెన్సు కుదరటం లేదు. పదేళ్ళ కిందటి పాత స్మృతులు మనసులో మెదిలి గిలిగింతలు పెడుతున్నాయి. అప్పుడు నాకు పన్నెండేళ్ళుంటాయేమో. కృష్ణ నాకన్నా రెండు మూడేళ్ల పెద్ద. ఎలిమెంటరీ స్కూల్లో చదువుకునే రోజులు. ఎన్ని సాయంకాలాలు నేనూ, కృష్ణా ఈ రైలు పట్టాల మీద చెట్టాపట్టా లేసుకుని ఎంతెంత దూరం నడిచేవాళ్ళమో! ఓడిపోయిన వాళ్ళు గెలిచిన వాళ్ళకి - మర్నాటిరోజు మాబడి ముందర అమ్మే జాంపళ్లు కొనివ్వాలి. అదీ మా పందెం. కృష్ణ నాతో సమంగా నడవలేకపోయేవాడు. పది గజాలైనా నడవక ముందే బాలెన్సు తప్పిపోయేది. చప్పట్లు చరిచి నవ్వుతూ ఎగతాళి పట్టించేదాన్ని. పట్టుకువి మొట్టికాయ లేసేవాడు. ఒకసారి గాలిలో తేలిపోతున్నట్టు హుషారుగా పట్టాల మీద నడుస్తున్నాను. వెనకనించి వేసిన ఇంజను కూత కూడా వినిపించలేదు నాకు. సుడిగాలిలా రివ్వున దూసుకువచ్చి నన్ను పొదివి పట్టుకుని పక్కకి తప్పించాడు కృష్ణ. ఆ ఊపుకి ఇద్దరం దొర్లుకుంటూ రైలు పట్టాలమీంచి కిందపడ్డాము. ఇద్దరికీ మోకాళ్లు మాత్రం గీరుకుపోయినయ్. భయంతో కొద్ది క్షణాలపాటు కృష్ణని గట్టిగా కరచుకుని వుండిపోయాను. తెలిసీ తెలియని ఆ పసిప్రాయంలోనే అతని కౌగిట్లో నాకు కలిగిన అనిర్వచనీయమైన అనుభూతి నాకిప్పటికీ బాగా గుర్తు. ఆ తరువాత కొన్నాళ్ళకి నాన్నకి బదిలీ అయింది. నేను కృష్ణకి కొన్ని వందల మైళ్ళు దూరంగా వెళ్ళిపోవడం జరిగింది. ఎప్పుడైనా వుత్తరాలు రాసుకునేవాళ్ళం. "వయసొచ్చిన పిల్లవి. ఈ వుత్తరాలేమిటే?" అంటూ వాటిని కూడా నిషేధించింది అమ్మ.

మేం చదువుకున్న ఎలిమెంటరీ స్కూలు ఇప్పుడు హైస్కూలుగా మారింది. కృష్ణ అక్కడే తెలుగు మేష్టారుగా వుంటున్నాడని తెలిసింది. నేనిప్పుడు స్వతంత్రురాలిని. నన్ను శాసించే అధికారం ఎవ్వరికీ లేదు. కృష్ణకు చేరువ కావాలనే ఈ స్కూల్లో టీచరు వుద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్నాను. పిలుపు వచ్చింది.

కృష్ణ నన్నిప్పుడు గుర్తుపట్టగలడా? కృష్ణతో కలిసి మళ్లీ ఈ పట్టాల మీద నడవాలని కోరికగా వుంది. రైలుపట్టాల్లా కాకుండా నా జీవితం కృష్ణతో కలిసిపోవాలి. ఇకనెప్పుడూ అతనికి దూరం కాకూడదు.

రైలు కట్టకి అవతల టూరింగు టాకీసులోంచి ఆట మొదలు కావటానికి సూచనగా సినిమా పాటలు వినిపిస్తున్నాయి. రైలు ఎంతకీ కదలక పోయేసరికి జనం ఒక్కొక్కరే దిగిపోతున్నారు. అతనెవరో ఇటే నడిచి వస్తున్నాడు. అతని వెనకాలే నడిచి వచ్చే ఆవిడ 'చిన్నపిల్లలా పట్టాల మీద నడిచే ఈ పిచ్చిది ఎవరా!' అన్నట్టుగా నన్నే చూస్తోంది వింతగా.

అతను బాగా దగ్గరయ్యాడు. ఎక్కడో చూసినట్టుంది.

"కృ....ష్ణ...."

"రే....వ....తీ! నువ్వు....?"

ఆవిడ మా ఇద్దరికేసీ విస్మయంగా చూస్తోంది.

"మా ఆవిడ సీతా! ఈ అమ్మాయీ నేనూ చిన్నప్పుడు...."

సరిగ్గా అప్పుడే కదలబోయిన ఇంజను చేసిన రొదలో కృష్ణ మాటలు నాకు వినబడలేదు.

—జి. మల్లీశ్వరి